RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 5 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 12 జులై 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# ప్రక్షాళన దిశగా...

## ప్రధాన పార్టీల అధ్యక్షుల మార్పు!?

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయ పార్టీలు మార్పులు కూర్పుల దిశగా ముందుకు సాగుతున్నాయి.

మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సంస్థాగతంగా సంచలన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే పార్టీల రాష్ట్ర అధ్యక్షుల నియామకాలపై ఫోకస్ పెట్టాయి కాంగ్రెస్, బీజేపీ. ఇక మరో పార్టీ బీఆర్ఎస్ సైతం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలి? ఎలాగూ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఆల్రెడీ ఉన్నారు. అడిషనల్ గా ఇంకేమేమి చేయాలి? ఈ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.

**పార్టీల్లో సంస్థాగత మార్పులు..** తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకున్న రాజకీయ పార్టీలు ఆయా పార్టీల్లో ఎలాంటి సంస్థాగత మార్పులు చేయాలి? అనేదానిపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ ని తొలగించిన ఆయన స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని నియమించారు.

**బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు? :** కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా ఉంటారని ముందుగానే జాతీయ స్థాయి నాయకత్వం క్లారిటీ ఇచ్చింది. దాంతో దాదాపుగా జూన్ నెలలోనే కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడం ఖాయం. అదే నెలలోనే బీజేపీలో అధ్యక్ష మార్పు ఉండబోతోంది.

**పీసీసీ పగ్గాలు ఎవరికి? :** ఇటు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఆయన కృషికి ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దీంతో కాంగ్రెస్ కూడా కచ్చితంగా పీసీసీ అధ్యక్షుడిని మార్చబోతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కి కొత్త అధ్యక్షుడు రానున్నారు.

**పార్టీ బలోపేతం దిశగా కేసీఆర్ అడుగులు..** ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మొదటి నుంచి కూడా కేసీఆర్ ఉన్నారు. 2019లో బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టింది.

ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటీఆర్ కి కట్టబెట్టారు. అధ్యక్షుడిగా కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఇద్దరూ.. ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే అనుకున్న ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. మళ్లీ కార్యకర్తలను, పార్టీని పునరుత్తేజం చేసేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు.

**హరీశ్ రావుకి ప్రాధాన్యత..! :** అధికారంలో ఉన్న పదేళ్లు పార్టీని పట్టించుకోలేదు, సంస్థాతగతంగా నిర్మించలేదనే ఒక విమర్శ ఉంది. ఎన్నికలకు ఒక ఏడాది ముందు మాత్రమే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించింది తప్పితే రాష్ట్ర కార్యవర్గం కానీ జిల్లా కార్యవర్గం కానీ ఎక్కడా లేదు. కాబట్టి కార్యవర్గ నిర్మాణాలతో పాటు, బీఆర్ఎస్ లో ఉన్న మరో కీలక నేత హరీశ్ రావుకి కొంత ప్రాధాన్యత ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా మూడు ప్రధాన పార్టీల్లో ఎలాంటి మార్పులు జరగబోతున్నాయి?

ఆ పార్టీల్లో ఏం జరగబోతోంది? లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి మార్పులు ఉండనున్నాయి? ఉన్న నాయకత్వాన్ని ఎలా కూర్పు చేయబోతున్నారు? ఇలాంటి అంశాలపై స్పెషల్ అనాలసిస్.. "చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?" లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మాత్రం గట్టి దెబ్బే తగిలిందని చెప్పుకోవాలి.




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలస జోరు కొనసాగుతుంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చేరనున్నారు. ఆయనతోపాటు ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు సైతం పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో సీఎం నివాసంలో రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశ్ గౌడ్ సైతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచరం. ఈ వార్తలు వైరల్ కావడంతో.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం రంగంలోకి దిగింది. ఆ క్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం ప్రకాష్ గౌడ్ మనసు మార్చుకున్నట్లు చర్చ సైతం సాగింది. దీంతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్.. కాంగ్రెస్ పార్టీలో చేరికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆయన అనుచరగణంలో ఓ చర్చ సాగింది. అదీకాక.. సీఎం రేవంత్ రెడ్డికి ప్రకాశ్ గౌడ్ మిత్రుడు అనే సంగతి అందరికీ తెలిసిందే. గతంలో వీరిద్దరూ తెలుగుదేశం పార్టీలో కలిసి పని చేశారు. 2009, 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా ప్రకాశ్ గౌడ్ గెలుపొందారు. అయితే 2014 ఎన్నికలనంతరం ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారు.




హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రంగం సిద్ధమయ్యింది. తెలంగాణలో 2019లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాదిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడానికి కసరత్తులు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల అంశంపై వివాదం ఉంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీసీ సంఘాలు ఆందోళన చేస్తూ వున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇంకా క్లారిటీ రాలేదు. అయినప్పటికీ ఆగస్టు 15 తర్వాత ఏ క్షణంలోనైనా స్థానిక ఎన్నికలు జరగవచ్చు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో ఆగస్టు 15లోపు రెండు లక్షల రూపాయలలోపు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయం కూడా అయిపోయింది, రుణమాఫీ చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రభుత్వం ఆలోచన. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు ఆగస్టు తర్వాత ఉండబోతున్నాయి.




# మహారాష్ట్రపై మళ్ళీ గురి

## అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ 'సై'

మళ్లీ మహారాష్ట్రపై బీఆర్ఎస్ ఫోకస్ పెడుతున్నది. మరో నాలుగు నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అక్కడ పోటీ చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే అక్కడ పార్టీ కార్యాలయాలను సైతం ప్రారంభించింది. సభ్యత్వాలు చేసి నేతలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. అయితే కేసీఆర్‌కు కాలు విరగడం, అసెంబ్లీ ఎలక్షన్స్‌లో ఓటమితో ఆ స్టేట్‌కు కొంత దూరంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడ పోటీ చేయకపోవడంతో నైరాశ్యంలో కొంత మంది పార్టీని వీడారు. అయితే ఎలాగైనా అక్కడ అసెంబ్లీ బరిలో నిలిచి సత్తాచాటాలని పార్టీ అనుకుంటున్నది. అందుకోసం పార్టీ అధినేత కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం.

**గులాబీ పార్టీకి 20 లక్షలకు పైగా సభ్యత్వాలు...** మహారాష్ట్రలో పాగా వేయాలని గులాబీ పార్టీ బాస్ కేసీఆర్ భావిస్తున్నారు. ఆ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాబోయే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయాలని కసరత్తు ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగువారు ఎక్కువగా ఉన్న ఔరంగాబాద్, నాందేడ్, కందార్ లోహ, లాథూర్, కొల్లాపూర్‌లో బహిరంగసభలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు పలు సంఘాల నేతలు, వివిధ పార్టీల కార్యకర్తలు గూలాబీ గూటికి చేరారు. నాందేడ్‌లో సొంతభవనంలో పార్టీ ఆఫీసునూ ప్రారంభించారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసి మద్దతుదారులతో కలిసి 300లకు పైగా సర్పంచ్, వార్డు సభ్యులను కైవసం చేసుకున్నారు. నాగ్‌పూర్ డివిజన్‌లోని భండారా జిల్లాలో అత్యధికంగా 20, విదర్భ, షోలాపూర్‌లోని 15 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. 288 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20 లక్షలకు పైగా సభ్యత్వాలు చేశారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణం చేపట్టారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి ప్రభుత్వాన్ని కోల్పోవడంతో పాటు ప్రమాదవశాత్తు కిందపడటంతో కేసీఆర్ తొంటి ఎముక విరుగడంతో మహారాష్ట్రలో పార్టీ కార్యక్రమాలు స్తంభించిపోయాయి. ఆ నేతలకు కలిసే అవకాశం సైతం ఇవ్వలేకపోయారు. కేడర్‌లో సందిగ్ధం నెలకొంది. మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, రైతు సంఘం నేత మానిక్‌రావు కదం, మహారాష్ట్ర బీడ్ జిల్లా ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దిలీప్ గోరే రాజీనామా చేశారు. వీరితో పాటు పలువురు వివిధ పార్టీల్లో చేరారు.

**రాష్ట్ర యాక్టివ్ లీడర్లకు 'మహా' ప్రచార బాధ్యతలు!....** జూన్ 4న లోక్‌సభ ఫలితాలు రానున్నాయి. ఆ తర్వాత కేసీఆర్ తన ఫోకస్ అంతా మహారాష్ట్రపై పెట్టనున్నట్టు సమాచారం. ఇప్పటికే అక్కడ పార్టీ సభ్యత్వాలు, శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో కేసీఆర్ ఆ రాష్ట్ర ప్రజలను ఆకర్షించారు. బీఆర్ఎస్ అధినేత నిర్వహించిన సభలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలో సమన్వయకర్తగా వంశీధర్‌రావును నియమించారు. ఆయనతో పాటు 15 మందితో మహారాష్ట్ర తాత్కాలిక స్టీరింగ్ కమిటీతో పాటు డివిజన్లకు ఇన్‌చార్జీలనూ నియమించారు. కమిటీలు సైతం బలంగా ఉండటంతో ఎలక్షన్ షెడ్యూల్ వెలువడక ముందే పార్టీ కేడర్‌ను యాక్టివ్ చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణలోని యాక్టివ్ లీడర్లకు సైతం అక్కడ ప్రచార బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నట్టు సమాచారం.

**పార్టీ ప్రోగ్రామ్స్, పోటీపై నేతలకు సూచనలు!...** మహారాష్ట్రకు చెందిన నేతలు తెలంగాణ భవన్‌కు తరచూ వచ్చిపోతున్నారు. పార్టీ కార్యక్రమాలు, పోటీపై వారికి సూచనలు ఇస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతేగాకుండా కేసీఆర్ సైతం పలువురికి ఫోన్ చేసి అసెంబ్లీలో పోటీపై క్లారిటీ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. పార్లమెంట్ ఎలక్షన్స్ సమయంలో జరిగిన పరిణామాలను వివరిస్తూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని నేతలకు భరోసా ఇస్తున్నట్టు తెలిసింది.

అసంతృప్తితో ఉన్న నేతలందరితో టచ్‌లోకి వెళ్లాలని పార్టీ సమన్వయకర్త వంశీధర్‌రావుకు కూడా సూచించినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ పార్టీని ప్రజలు ఏ మేరకు విశ్వసిస్తారనేది చూడాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# సం"పన్ను".. భారత్ లో సంచలనం..

## అమలు మాత్రం ఆ దేశంలో..

భారత్ లో ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు గుర్తున్నాయా...? "సంపద పన్ను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ను పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయి. అంతేకాదు.. పిట్రోడాను ఆ పార్టీ బాధ్యతల నుంచి తప్పించింది. చివరకు మళ్లీ చేర్చుకోవడం వేరే విషయం. అయితే, సంపద పన్ను వంటి ఆలోచనలు ఏమీ లేవని కాంగ్రెస్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కాగా, పిట్రోడా.. అమెరికాలో అమల్లో ఉన్న వారసత్వ పన్ను భావనను వివరిస్తూ.. "అమెరికాలో వారసత్వపు పన్ను ఉంది. ఒక వ్యక్తి $100 మిలియన్ల విలువైన సంపదను కలిగి ఉంటే అతడు లేదా ఆమె మరణించినప్పుడు మాత్రమే బదిలీ చేయగలరు. 45% తన పిల్లలకు పోగా 55% ప్రభుత్వం లాక్కుంటుంది. మీ తరంలో మీరు సంపాదించి వెళ్లిపోతున్నారు, మీ సంపదను ప్రజల కోసం వదిలివేయాలి, అందులో సగం. ఇది నాకు న్యాయంగా అనిపిస్తుంది" అని పేర్కొన్నారు. కాగా.. భారత్ లో ఇలాంటిదేమీ లేకున్నా. మరొక దేశంలో మాత్రం అమల్లోకి వస్తోంది. మొత్తం యూరప్ లోనే బాగా డెవలప్డ్ దేశంగా భావించే ఫ్రాన్స్ లో జాతీయ అసెంబ్లీ (పార్లమెంటు)కి ఎన్నికలు ఆసక్తి రేపాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడమే దీనికి కారణం. ఇప్పుడు అక్కడ లెఫ్ట్ వింగ్ కు చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం అవుతోంది. దీంతో ఆ దేశంలో ఎలాంటి విధానాలు అమలవుతాయా? అనే చర్చ నెలకొంది. మరోవైపు పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేస్తూ మెక్రాన్ తీసుకున్న నిర్ణయం ఆయనకే తిప్పికొట్టినట్లయింది. 577 స్థానాలున్న శక్తిమంతమైన దిగువ సభపై పట్టు సాధించే ఆయన వ్యూహం బెడిసికొట్టింది. సోమవారం వెలువడ్డ ఫలితాల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు.

**వామపక్షం సారథ్యం :** ఫ్రాన్స్ లో వామపక్షానికి చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడుతోంది. స్వతహాగానే వామపక్షాలు అధికారంలో ఉంటే ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. ఇక ఫ్రాన్స్ లో న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి రానుండడంతో రూ.3.60 కోట్ల (4 లక్షల యూరోలు) కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారిపై 90 శాతం పన్ను విధిస్తామని కూటమి ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. ఇదిప్పుడు అమలు చేస్తారా? అన్న ప్రశ్న వస్తోంది. మరోవైపు రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లకు పరిమిత చేయడం.. ఇంధన ధరల నియంత్రణ, కనీస వేతనాల పెంపు తదితర అంశాలను కూడా తన హామీల్లో ప్రస్తావించింది. దీంతో భారత్ లో సంచలనం రేపిన సంపద పన్ను ఫ్రాన్స్ లో అమలు కానుందా? అనే అభిప్రాయం వినిపిస్తోంది.

# రహస్య స్థావరాలు.. కోడ్ భాష



మంథని : మంథని డివిజన్ పరిధిలో గంజాయి కోరలు చాస్తోంది. ఉన్నత భవిష్యత్తు కలిగిన యువత, చదువుకోవాల్సిన మైనర్లు మత్తుకు బానిసలవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అక్రమార్కులు సంపాదనే లక్ష్యంగా గంజాయిని విక్రయిస్తూ యువత భవితను చిత్తు చేస్తున్నారు. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వారు గంజాయి మత్తులో తూలుతున్నారు. పోలీసులు దాడులు చేస్తూ కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ, విక్రయదారుల్లో, వ్యసనపరుల్లో మార్పు రావడం లేదు.

సింగరేణిలో విస్తరిస్తున్న మత్తు

మంథనిలోని పలు రహస్య స్థావరాల్లో దళారులు కోడ్ భాష ద్వారా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం. మాల్, శిలావత్, గ్రీన్, బ్లాక్ వంటి పేర్లను వాడుతున్నారు. గ్రీన్ అంటే పచ్చిది, బ్లాక్ అంటే ఎండిన గంజాయి అని అర్థం. స్కోర్ ఎంత? అంటే ధర అడుగుతున్నట్లు. విక్రయదారుల వద్దకు మాల్(సరకు) వచ్చిన వెంటనే వ్యసనపరులకు సమాచారం అందిస్తారు. ఈ ప్రాంతంలో యువత, మైనర్లు వందల సంఖ్యలో గంజాయికి బానిసలుగా మారుతున్నారు. రామగిరి మండలంలోని సింగరేణి ప్రాంతంలో సైతం అనేక మంది మత్తులో మునిగి తేలుతున్నారు. మంథని పట్టణంలో గంజాయికి అలవాటు పడిన వారిని ఇటీవల పోలీసులు ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. వ్యసనపరులు మత్తులో గొడవలకు దిగుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి. పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు చిన్న వయసులోనే మద్యానికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది అనారోగ్యానికి గురయ్యారు.

నలభై రోజుల్లో 8 కిలోల స్వాధీనం

గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు కొద్ది రోజులుగా తరచూ దాడులు నిర్వహిస్తున్నారు.

జూన్ మొదటి వారంలో ముత్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

జూన్ 11న మంథని బస్టాండ్ ఏరియాలో పట్టణానికి చెందిన ప్రశాంత్, మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన సంతోష్ గంజాయి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.07 కిలోలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

రామగిరి ఠాణా పరిధిలోని నాగేపల్లి వద్ద జూన్ 23న కరీంనగర్‌కు చెందిన వంశీకృష్ణ, అనిల్, సాయి, మణిప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

రామగిరి మండలం లద్నాపూర్ ఓసీపీ-2 సెంటర్ వద్ద ఈ నెల 6న గంజాయి అమ్మడానికి వెళ్తున్న అయిదుగురిని అరెస్టు చేశారు. వీరి నుంచి 3 కిలోల గంజాయిని పట్టుకున్నారు.

దాదాపు నలభై రోజుల్లో 8 కిలోల గంజాయిని పట్టుకుని, 15 మందిని అరెస్టు చేశారు.

విక్రయదారులపై కఠిన చర్యలు - ఎస్.వెంకటేశ్వర్లు, సీఐ, మంథని

సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఆంధ్రా, భద్రాచలం, ఒడిశా ప్రాంతాల నుంచి ఇక్కడికి తీసుకొస్తున్నట్లు తెలిసింది. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి. గంజాయికి సంబంధించిన సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి నిర్మూలనకు యువత ముందుకు రావాలి.

# ట్రామాకేర్ సెంటర్.. ఏర్పాటులో తాత్సారం



తాండూరు : రహదారి ప్రమాదాల్లో నిత్యం ఎంతోమంది గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వీరికి తక్షణ వైద్యం అందించి రక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జాతీయ రహదారుల వెంబడి ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇది సంతోషించదగిన పరిణామం. ఈ తరహా కేంద్రాన్ని జిల్లాలోనూ ఏర్పాటుచేయాలని గతంలో నిర్ణయించినా కొలిక్కి రాలేదు. ప్రస్తుతం దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

2014లోనే శంకుస్థాపన హైదరాబాద్-బీజాపూరు అంతర్జాతీయ రహదారి జిల్లా మీదుగా వెళ్తుంది. దీనిపై ఏటా జరుగుతున్న ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. వందల కొద్దీ గాయాలకు గురౌతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సత్వర వైద్యం అందించి సాంత్వన కలిగించేందుకు తాండూరులోని జిల్లా ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటు చేయడానికి సంకల్పించింది. 2014 అక్టోబరు 15న ఇందుకోసం శంకుస్థాపన చేసింది. ప్రపంచ బ్యాంకు నుంచి మంజూరైన రూ.50 లక్షలు ఖర్చు చేసి ఆసుపత్రి గ్రౌండ్ ఫ్లోర్ ప్రధాన బ్లాక్ గదుల్లో సేవలు అందించేందుకు సిద్ధం చేశారు. 2019 నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని అప్పట్లో వైద్యశాఖ పేర్కొంది. జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లకు తోడు అదనంగా ఒక్కో జనరల్ సర్జన్, అనెస్తీషియా, ఆర్థోపెడిక్‌ను నియమించేందుకు నిర్ణయించినా కుదరలేదు. దీంతో కేంద్రంలో సేవలు అందుబాటులోకి రాలేదు.

తాండూరులోనే ఎందుకంటే..: తాండూరులోనే ట్రామాకేర్ ఏర్పాటు చేయడానికి ఎన్నో అవసరాలున్నాయి. ఇక్కడి జిల్లా ఆసుపత్రిలో క్షతగాత్రులకు అవసరమైన మేరకు రక్తం అందించేందుకు రక్తనిధి కేంద్రం ఉంది. సీటీ స్కాన్, ఆర్థోపెడిక్, అనెస్తీషియా, జనరల్ సర్జన్లు ఉన్నారు. ప్రమాదాలకు గురైన వారిని నిర్ణీత సమయంలోనే తరలించ వచ్చనే ఉద్దేశంతో ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ గంటే కీలకం: ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఒక గంటలోపు ట్రామాకేర్‌కు తరలించాలి. ఆ తొలిగంటనే 'గోల్డెన్ అవర్' అంటారు. తక్షణమే సాంత్వన కలిగేలా చికిత్సలు అందించి సాధారణ స్థాయికి తీసుకు రావడానికి కృషి చేస్తే వారు ప్రాణాపాయం నుంచి బయటపడతారు.

హైదరాబాద్-విజయవాడ రహదారిలో ఏర్పాటు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రభుత్వం నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద ట్రామాకేర్ ఆసుపత్రి నిర్మాణం చేయబోతోంది. ఇదే సమయంలో అన్ని ఏర్పాట్లు జరిగిన తాండూరు ఆసుపత్రిలో కూడా ట్రామాకేర్ సేవలు అందించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరులో పదేళ్ల కిందటే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ఆరంభమయ్యాయి. ఈ కేంద్రం ఏర్పాటులో ఎందుకు జాప్యం జరుగుతుందో విచారిస్తా. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ కూడా ప్రారంభించేలా చూస్తాను.

# కాగితపు పెన్ను.. పర్యావరణానికి దన్ను

చౌటుప్పల్ : బడిలో పిల్లల్ని చేర్పించి అక్షరాభ్యాసం చేయించగానే పెన్ను చేతికిస్తాం. తరగతులతో పాటు ఉపయోగించే పెన్నుల సంఖ్య కూడా పెరుగుతుంది. కార్యాలయంలో పని చేసే ఉద్యోగి, ఇంట్లో గృహిణి పద్దులు రాయడానికి, కిరాణ దుకాణంలో లెక్కలు రాయడానికి కలం ఉపయోగించక తప్పదు. దాదాపు 95 శాతం మంది ఉపయోగిస్తున్నవి 'ప్లాస్టిక్'తో తయారైన పెన్నులే. ఇవీ చౌక ధరల్లో లభిస్తుండటంతో అందరూ కొనుగోలు చేస్తున్నారు. రీఫిల్ ఖాళీ కాగానే పెన్నును విసిరి పారేసి మరొకటి కొంటున్నారు.. ఇలా జనాభాలో 69 శాతం మంది ప్లాస్టిక్ పెన్నులను నిత్యం ఉపయోగిస్తున్నారు. సగటున నెలకు మూడు చొప్పున ఏడాదికి 36 వాడి పారేస్తున్నారని ఓ సర్వేలో గుర్తించారు. పర్యావరణానికి మేలు చేయాలనే సంకల్పంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్లకు చెందిన గుర్రం ప్రమోద్‌కుమార్, ఉమ దంపతులు కాగితంతో పెన్నులు, పెన్సిళ్లు తయారు చేస్తున్నారు. వీటిని వాడిన తర్వాత పారవేసినా కొంత కాలం తర్వాత భూమిలో కరిగిపోతాయి. రీఫిల్ మాత్రం ప్లాస్టిక్. దీనికి ప్రత్యామ్నాయం లేదు. వీటి తయారీకి కుటీర పరిశ్రమను వారి ఇంట్లోనే ఏర్పాటు చేశారు. పెన్ను వెనుక భాగంలో విత్తనాలు(క్యాప్సుల్స్) పొదిగి ఉంచారు. వాడాక వాటిని పారేసినా.. వర్షాలకు విత్తనాలు మొలకెత్తి పచ్చదనం పరిఢవిల్లుతుందని ఈ దంపతులు యోచన. ఇదో చిన్న ప్రయత్నం.. అందరూ అమలు పరిస్తే బృహత్కార్యం అవుతుంది. పచ్చలహారం వికసిస్తుంది.

పిల్లలకు పర్యావరణంపై ప్రేమ పెంచాలని..

గుర్రం ప్రమోద్‌కుమార్, ఉమ, నేలపట్ల, చౌటుప్పల్

మేమిద్దరం ఎంబీఏ పూర్తి చేశాం. ప్రైవేటు ఉద్యోగం చేసేవాళ్లం. ప్రకృతి విధ్వంసాల్లో ప్లాస్టిక్ ప్రధానంగా మారిందని గమనించాం. ప్లాస్టిక్ పెన్నులు వాడి పారేయడం వల్ల ప్రకృతికి తాము నష్టం



చేస్తున్నామనే విషయాన్ని పిల్లలు అర్థం చేసుకోలేరు. అందుకే పర్యావరణానికి అనుకూలమైన వాటిని ప్రోత్సహించాల్సిన అవసరముందని భావించాం. రీఫిల్ అయిపోగానే పెన్నును ఇంటి పెరట్లో నాటితే చిన్న విత్తనం నుంచి పెద్ద వృక్షంగా ఎదుగుతుందని ఆలోచించాం. కాగితపు పెన్ను, పెన్సిల్‌కు వెనుకభాగంలో పూలు, పండ్లు, కూరగాయల విత్తనాలను అమర్చితే పిల్లలకు తాజా పోషకాహారం కూడా అందుతుందని యోచించాం. సొంత ఊరికి తిరిగొచ్చి నాలుగేళ్ల క్రితం విత్తనాలు అమర్చిన కాగితపు పెన్నులు తయారు చేసే కుటీర పరిశ్రమ ప్రారంభించాం. నెలకు అరవై వేలు పెన్నులు తయారు చేస్తున్నాం. వీటిని కార్పొరేట్ కంపెనీలు, పాఠశాలలు, పుట్టిన రోజు వేడుకల్లో పంచేందుకు వారు సూచించిన పేర్లను పెన్నులపై ముద్రించి సరఫరా చేస్తున్నాం. కాగితపు పెన్నుల తయారీ ద్వారా తాము పరోక్షంగా కొన్ని వందల కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తిని ఆపగలిగామని, లక్షల సంఖ్యలో మొక్కలు ఎదిగేందుకు కారకులమయ్యామని, పిల్లలకు పర్యావరణంపై ప్రేమను పెంచగలిగామని సంతృప్తి ఉంది.

# లక్షే లక్ష్యం..!

మిర్యాలగూడ : ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. మహిళలు కేవలం ఉచిత ప్రయాణం అందించే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఎక్కేందుకు ఆసక్తి చూపుతుండడంతో డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు మహిళా ప్రయాణికులు అధికంగా ఉండడంతో బస్సులు ఎక్కేందుకు పురుషులు ఆసక్తి చూపడం లేదు. ఈ సమస్యలను అధిగమించి అధిక ఆదాయం రాబట్టేందుకు ఆర్టీసీ అనేక పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇటీవలే 'లక్షే లక్ష్యం' పేరుతో యాజమాన్యం అన్ని డిపోల నుంచి రోజుకు సాధారణం కన్నా రూ.లక్ష అదనపు ఆదాయం సాధించాలని సవాలు విసిరింది. ఈ దిశగా ఉమ్మడి జిల్లాలో అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు..

వచ్చే పౌర్ణమికి ఉమ్మడి జిల్లాలోని నార్కట్‌పల్లి మినహా మిగిలిన ఆరు డిపోల నుంచి తమిళనాడులోని ప్రసిద్ధ శైవక్షేత్రం అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. సూర్యాపేట, కోదాడ, నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ డిపోల నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు, యాదగిరిగుట్ట డిపో నుంచి సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ బస్సులన్నీ ఈ నెల 19న ఆయా డిపో కేంద్రాల నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలానికి చేరుతాయి. అక్కడ దర్శనం అనంతరం తిరిగి ఈ నెల 22న ఆయా డిపోలకు చేరుతాయి.

తిరుపతికి సైతం..కోదాడ డిపో నుంచి రెండు, మిర్యాలగూడ, దేవరకొండ డిపోల నుంచి ఒకటి చొప్పున ప్రతి రోజు తిరుపతికి సూపర్‌లగ్జరీ బస్సులు నడుస్తున్నాయి. ఈ మూడు డిపోల బస్సులు తొలుత ఆయా డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఈ డిపోల బస్టాండ్‌ల మీదుగా తిరుపతికి వెళ్తాయి. ఇవి కాకుండా బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి ప్రతి రోజు రెండు లహరి బస్సులు, హన్మకొండ డిపో నుంచి ఒక సూపర్ లగ్జరీ బస్సు మిర్యాలగూడ మీదుగా తిరుపతికి నడుస్తున్నాయి.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

ఎం.రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్గొండఆర్టీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న పలు పథకాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. సూపర్ లగ్జరీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ముందస్తుగా రాను, పోను రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం. భక్తుల రద్దీని బట్టి పుణ్యక్షేత్రాలకు మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం ప్రత్యేక బహుమతి పథకాన్ని ప్రారంభించాం.

# సర్వేకు సర్వావస్థలు..!

నల్గొండ : భూ సర్వే చేయించాలంటే రైతులకు అవస్థలు తప్పడం లేదు. చలాన్లు చెల్లించి నెలలు గడుస్తున్నా..సర్వేయర్లు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. భూముల కొలతల్లో వచ్చే తేడాలు, భూ తగాదాలు, ఇతర అంశాల పరిష్కారంలో భూసర్వే తప్పనిసరి. కర్షకులు తమ వివాదాలు పరిష్కరించుకోవడానికి అధికారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు ప్రైవేటు సర్వేయర్ల వద్దకు వెళ్తుంటే.. మరికొందరు ప్రభుత్వ అధికారులకు దరఖాస్తు పెట్టుకుంటున్నారు. చలాన్లు వందల సంఖ్యలో పెండింగ్ ఉండటంతో నిత్యం భూకొలతలు, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


కొందరివే చేయడంలో మతలబేంటీ..?

నిబంధనల ప్రకారం దరఖాస్తులను వరుస క్రమంలో పరిష్కరించాలి. కొందరివి ఎప్పుడూ పెండింగ్‌లోనే ఉంటుండగా.. మరికొందరివి వెంటనే పూర్తవుతున్నాయి. అధికారుల చేయి తడిపినవారివి త్వరగా సర్వే చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. అమాయక రైతులు సర్వేయర్లు వస్తారనే ఆశతో నెలల తరబడి ఎదురుచూస్తున్నారు.

నివేదిక జారీలో..భూములు, స్థలాలు సర్వే చేసిన తర్వాత అధికారులు జారీ చేసే నివేదిక (రిపోర్టు) ముఖ్యం. భూమి పూర్తి వివరాలు, హద్దులు, విస్తీర్ణం, పటం వంటివి ఇందులోనే ఉంటాయి. వీటి జారీలోను తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. చేయి తడిపితేనే గానీ చేతికందదని పేర్కొంటున్నారు.

సిబ్బంది కొరతేనా..

దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి సర్వేయర్ల కొరతే కారణంగా చెబుతున్నారు. నల్గొండ జిల్లాలోని 32 మండలాల్లో 21 మండలాలకు సర్వేయర్లు, ఆరు మండలాలకు డిప్యూటీ సర్వేయర్లు ఉన్నారు. అయిదు సర్వే పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 23 మండలాల్లో 16 మండలాలకు సర్వేయర్లు ఉన్నారు. ఏడు మండలాల్లో సర్వేయర్ల



పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలకు 15 మండలాల్లో సర్వేయర్లు పని చేస్తున్నారు. ఒక్క చోట ఖాళీగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఖాళీలున్న చోట పక్క మండలాల వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు ప్రభుత్వ పనులు అధికంగా ఉండడంతో దరఖాస్తులు పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రోడ్డు మార్గాలకు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, తదితర అభివృద్ధి పనులకు భూ సేకరణకు సర్వే పనులు చేపట్టాల్సి వస్తోందని, తొలుత ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి రావడం వల్ల కర్షకుల భూముల సర్వేలో జాప్యం ఏర్పడుతుందని పలువురు సర్వేయర్లు పేర్కొంటున్నారు.

త్వరలో పరిష్కారం

జిల్లాలో భూ కొలతల కోసం దరఖాస్తు చేసుకున్న కర్షకుల భూములు అన్నింటినీ సర్వే చేస్తామని భూమి రికార్డుల కొలతల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని మండలాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో జాప్యం ఏర్పడుతుందని వివరించారు.

పెండింగ్ దరఖాస్తులు ఇలా..

| | |
|---|---|
| నల్గొండ | 1108 |
| సూర్యాపేట | 915 |
| యాదాద్రి | 447 |

# అన్నదాతకు మిరప ఘాటు

ఖమ్మం : వానాకాలం సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులకు పంట పెట్టుబడి అవసరం. సీజన్‌లో సరైన ధర రాకపోవటంతో అనేక మంది రైతులు తమ మిరప పంటను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకున్నారు. ఇప్పుడు అవసరానికి విక్రయిద్దామంటే సరైన ధర రాక ఆందోళన చెందుతున్నారు.

ధర దారుణం...ఖమ్మం జిల్లాలోని శీతల గిడ్డంగుల్లో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, ఏపీలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు నిల్వ చేసుకున్నారు. విపణిలో వ్యాపారులు సిండికేట్ కావటంతో ఏసీ మిరపకు ఆశించిన ధర లభించడం లేదు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సోమవారం శీతల గిడ్డంగుల్లోని సరకు క్వింటా కనిష్ఠ ధర రూ. 11 వేలు కాగా, నమూనా ధర రూ. 15,500, గరిష్ఠ ధర రూ. 19,550 పలికింది. జెండా పాట గరిష్ఠ ధర రూ. 19,550 కావడంతో ఆ ధరకైనా కొంత సరకు అమ్ముకోవాలని రైతులు భావించారు. విపణిలో మాత్రం జెండా పాట ధరకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత ఎక్కువగా ఉండే డీలక్స్ రకాలను క్వింటా రూ. 16,500 నుంచి రూ. 17,000 వరకు మాత్రమే కొనుగోలు చేశారు. మీడియం రకాలను రూ. 14,000 నుంచి రూ. 16,000 మధ్య కొన్నారు. జెండా



పాట, వ్యాపారులు కొనుగోలు చేసిన ధరకు మధ్య క్వింటాకు రూ. 4000 నుంచి రూ. 4,500 వ్యత్యాసం ఉంది. ఇది రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తోంది. విపణిలో 100 మందికి పైగా వ్యాపారులున్నా జెండా పాటకు చాలా తక్కువ మంది హాజరవుతున్నారు.

వ్యాపారుల సరకు కొనుగోలుకే ..

కొందరు వ్యాపారులు రైతుల సరకు కన్నా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న వ్యాపారుల సరకు కొనుగోలు చేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. సిండికేట్‌గా మారి రైతులకు నష్టం కలిగిస్తున్నారు. కొంతమంది జీరో వ్యాపారానికి సహకరించాలని కోరుతున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ప్రభుత్వానికి 5 శాతం జీఎస్టీ, మార్కెటింగ్ శాఖకు ఒక శాతం పన్నుకు గండి పడే ప్రమాదం ఉంది. విదేశాలకు ఆర్డర్లు లేవని చెబుతున్న వ్యాపారులు వ్యాపారుల సరకును ఒక ధరకు, రైతుల సరకును మరో ధరకు కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న మిరప

మొత్తం శీతల గిడ్డంగులు: 48

నిల్వ సామర్థ్యం(బస్తాల్లో): 46,98,500

ప్రస్తుతం నిల్వ ఉన్నవి: 38,18,674

దీనిలో రైతులకు చెందినవి: 27,24,551

వ్యాపారుల బస్తాలు: 10,94,123

ప్రస్తుతం విదేశాలకు ఎగుమతులు లేవని వ్యాపారులు చెబుతున్నారు. ఆర్డర్లు లేకపోవటంతో డిమాండ్ తగ్గింది. దీంతో సరకు కొనుగోలుకు వెనకంజ వేస్తున్నారు. శీతల గిడ్డంగుల నుంచి నాణ్యత ఎక్కువగా ఉన్న నమూనాలు రావడం లేదు. మామూలు రకాల నమూనాలను తీసుకురావటం ధరపై ప్రభావం చూపుతోంది.

పి. ప్రవీణ్‌కుమార్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

# ఇత్తడి దొంగలు!

ఖమ్మం : నాగార్జున సాగర్ ఎడమ కాలువపై క్రాస్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్లు ఎత్తేందుకు, దింపేందుకు ఉపయోగించే ఇత్తడి చక్రాలు (వార్మ్ లేదా క్రౌన్ వీల్స్) చోరీకి గురవుతున్నాయి. కాలువలో నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడం, నియంత్రించటం కోసం ప్రధాన కాలువపై అవసరమైన ప్రదేశాల్లో క్రాస్ రెగ్యులేటర్లు నిర్మించారు. పెద్ద వెడల్పు, అధిక బరువుతో ఉండే షట్టర్లు కాలువలోకి దింపటం, పైకి ఎత్తడం కోసం ఈ చక్రాలు సహకరిస్తాయి. కొన్ని క్రాస్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్లను విద్యుత్తు మోటార్ల సాయంతో ఆపరేట్ చేస్తారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే మనుషులే చక్రాలను తిప్పుతూ షట్టర్లను తెరుస్తారు. ఇది చాలా కష్టతరమైన ప్రక్రియ. ఖమ్మం జిల్లాలో సాగర్ ప్రధాన కాలువపై ముదిగొండ మండలం, ఖమ్మం రూరల్ మండలాలు సహా తనికెళ్ల, ఏన్కూరు, కల్లూరు ప్రాంతాల్లో క్రాస్ రెగ్యులేటర్లున్నాయి. వీటిపై దిమ్మెల్లో బిగించి ఉండే ఇత్తడి చక్రాలు చోరీకి గురయ్యాయి. ఖమ్మం సహా పూర్వ నల్గొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గతేడాది ఇవి చోరీకి గురైనట్లు నీటిపారుదలశాఖ అధికారులు గుర్తించి ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయి. ఒక్కో ఇత్తడి చక్రం విలువ ప్రస్తుతం రూ. 3లక్షల నుంచి రూ. 4 లక్షలు ఉంటుంది. ఒక షట్టర్ ఆపరేషన్ కోసం రెండు వార్మ్ వీల్స్ ఉపయోగిస్తారు. సాగర్ కాలువలపై షట్టర్లు, క్రాస్ రెగ్యులేటర్లు సహా ఇతర మెకానికల్ అంశాలు నిర్వహించే డివిజన్ కార్యాలయాలను కొన్నేళ్ల క్రితం రద్దు చేశారు. ఓఅండ్ఎం (ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్) డివిజన్ కార్యాలయాలకు అప్పగించారు. అప్పటి నుంచి షట్టర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ఆశాఖలోని అధికారులు, ఉద్యోగులు చెబుతున్నారు. గతేడాది సాగర్ కాలువలకు నీటి సరఫరా లేక క్రాస్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్లు ఎత్తడం, దించటం వంటి కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందు సాగర్ కాలువలపై షట్టర్ల నిర్వహణకు సంబంధించి వార్మ్ వీల్స్ కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పుడే సాగునీటి సరఫరా క్రమబద్ధీకరణ సులభతరమవుతుంది.

అంచనాలు రూపొందిస్తున్నాం..సాగర్ ప్రధాన కాలువపై క్రాస్ రెగ్యులేటర్ల వద్ద షట్టర్లు ఆపరేట్ చేయడంలో కీలకమైన వార్మ్ వీల్స్ (క్రౌన్ వీల్స్) గతేడాది ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో చోరీకి గురయ్యాయి. అప్పట్లో పోలీసు కేసులు పెట్టాం. ఈ ఏడాది క్రాస్ రెగ్యులేటర్ల వద్ద వార్మ్ వీల్స్ బిగించేందుకు అంచనాలు రూపొందిస్తున్నాం. అంచనాలకు ఉన్నతాధికారుల ఆమోదం లభించిన తర్వాత టెండర్లు ఆహ్వానించి పనులు చేపడతాం. అనసీయ, ఈఈ, ఖమ్మం, నీటిపారుదల శాఖ

# ఫీజులపై నియంత్రణేది?



సిరిసిల్ల : వీర్నపల్లికి చెందిన ఓ రైతు తన ఇద్దరు కుమార్తెలను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాడు. చిన్న కూతురు నర్సరీకి రూ. 18 వేలు, పెద్ద కూతురు రెండో తరగతికి రూ. 24 వేల అకాడమీ ఫీజు కట్టారు. ఇద్దరికీ పాఠశాల యూనిఫాం, పుస్తకాలకు కలిపి రూ. 20 వేలు అయింది. వీర్నపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు పాఠశాల బస్సుకు రూ. 28 వేలు చెల్లించాలని యాజమాన్యం సూచించింది. మొత్తంగా ఇద్దరి పిల్లలకు ఏడాదికి రూ. 90 వేలు అవుతుంది. సిరిసిల్లకు చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగి తన ఇద్దరు పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. 9వ తరగతి చదువుతున్న పెద్ద కుమార్తెకు రూ. 65 వేలు, 6వ తరగతి చదువుతున్న చిన్న కూతురుకు రూ. 50 వేలు అకాడమీ ఫీజు కట్టాడు. ఇద్దరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలకు కలిపి రూ. 30 వేలుగా పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఏడాదికి రూ. 1.45 లక్షలు చెల్లించాలని చెప్పింది.

జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఆకాశాన్నంటుతున్నాయి. ప్లేస్కూల్, హైస్కూల్ స్థాయిలో ఐఐటీ ఫౌండేషన్ అని, ప్రవేశ రుసుము, పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టులు, టైల పేరిట ఫీజులు లాగేస్తున్నారు. తమ పిల్లలు కార్పొరేట్ స్థాయి విద్యతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశపడుతున్న వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. కొన్ని పాఠశాలలకు ఉన్న డిమాండ్‌ను బట్టి 15 నుంచి 20 శాతం ఫీజులను ఈ ఏడాది కూడా పెంచాయి. వీటికి గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా పోయింది. ప్రభుత్వ పరంగా నియంత్రణ లేకపోవడం ఏటా రుసుములు పెంచడం ఆనవాయితీగా మారింది. 2022లో అప్పటి ప్రభుత్వం పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. 11 మంది మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. వారు పరిశీలించి పలు సిఫారసులు చేశారు. అవి కార్యరూపం దాల్చలేదు.

జిల్లాలోని 120 ప్రైవేటు పాఠశాలల్లో 24 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవు. చాలా ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. గతేడాది అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోలేదని, విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల భవనం ప్రహరీని కూల్చివేశారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయించకూడదు. కాగా యాజమాన్యాలు పాఠశాలలకు సమీపంలోని ఖాళీ గదులను అద్దెకు తీసుకుని, పురపాలిక నుంచి దుకాణం నిర్వహణకు అనుమతులు తీసుకుని విక్రయాలు కొనసాగిస్తున్నారు.

ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఫౌండేషన్ కోర్సుల పేరు చెప్పి ప్రత్యేక సిలబస్ పేరుతో పుస్తకాలను అందజేస్తున్నారు. వీటిని రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇందులోని సిలబస్ బోధించేందుకు స్టేట్ సిలబస్ పాఠ్యాంశాల పీరియడ్స్‌ను కుదిస్తున్నారు. దీంతో తెలుగు, హిందీ, ఆంగ్లంపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారు. వీటన్నింటిని పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్న విమర్శలున్నాయి. జిల్లాలో గడిచిన రెండేళ్లలో ఒక్క ప్రైవేటు పాఠశాలను కూడా ఎంఈవోలు, డీఈవోలు తనిఖీ చేసిన దాఖలాలు లేకపోవడమే ఇందుకు నిదర్శనం.

పట్టికను ప్రదర్శించాలి

– రమేశ్‌కుమార్, జిల్లా విద్యాధికారి

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఏటా పెంచుతున్న విషయంతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది సరైనది కాదు. ఫీజుల పెంపులో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులతో ఒక కమిటీ వేసి వారి సమక్షంలో నిర్ణయం తీసుకోవాలి. దాని తర్వాత తరగతుల వారీగా చెల్లించాల్సిన ఫీజుల పట్టికను పాఠశాల ఆవరణలో బహిరంగంగా ప్రదర్శించాలి. జిల్లాలోని ఇద్దరి ఎంఈవోలు మాత్రమే ఉన్నారు. మొన్నటి వరకు పదోన్నతులు, బదిలీలకే సరిపోయింది. ప్రైవేటు పాఠశాలల తనిఖీలు చేపట్టాలని ఎంఈవోలను ఆదేశిస్తాం.

# వేలంపై.. వేడి



గోదావరిఖని : బొగ్గుగనుల వేలంపై సింగరేణిలో వేడి పెరిగింది. గనులు సింగరేణికి దక్కే విధంగా పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేసుకున్న కార్మిక సంఘాలు ఆదిశగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. కొన్ని సంఘాలు ఒంటరిగా, మరి కొన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మూడు జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. మరోవైపు సింగరేణి వ్యాప్తంగా నిరసన దీక్షలు చేపడుతున్నారు. ఇటు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు మిగతా కార్మిక సంఘాలు పరిస్థితుల్లో సింగరేణికి సంబంధించిన గనులను సంస్థకే కేటాయించాలన్న పట్టుదలతో పోరాట కార్యక్రమాలను రూపొందించుకున్నాయి. నిరసనలతో మొదలు పెట్టి అవసరమైతే పారిశ్రామిక బంద్‌కు కూడా వెనుకాడకుండా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు ఎంఎండీఆర్ చట్టంలోని క్లాజ్‌లను గుర్తు చేస్తూ సింగరేణికి నేరుగా కేటాయించే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి.

పలు అంశాల ఆధారంగా కార్యాచరణ

సింగరేణికి గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్న సంఘాలు చట్టంలో ఉన్న క్లాజ్‌లను ప్రస్తావిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గనుల్లో ప్రభుత్వరంగ సంస్థల ద్వారానే తవ్వకాలు చేపట్టాలన్న నిబంధనలున్నాయి. దీనిని ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన గనులను సంస్థకు నేరుగా కేటాయించే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఉన్న గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదన్న నిబంధన ఉండటంతో దాని ప్రకారం కార్మిక సంఘాలు ముందుకు సాగుతున్నాయి. కోయగూడెం, శ్రావణ్‌పల్లి గనులు గిరిజన ప్రాంతాల్లోనే ఉన్నాయని వాదిస్తున్నాయి. ఎంఎండీఆర్ చట్టంలోనే ఉన్న మరో క్లాజ్ ప్రకారం సింగరేణికి నేరుగా కేటాయించే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి.

సంస్థ పరిరక్షణకు సంఘాల అండ

వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణికి కార్మిక సంఘాలు అండగా నిలుస్తున్నాయి. కొత్త గనులు లేక ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న క్రమంలో కార్మిక సంఘాలు సంస్థను పరిరక్షించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధమయ్యాయి. జూన్ 21న బొగ్గుగనుల వేలం ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం టెండరు దాఖలు చేయడానికి ఆగస్టు నెల వరకు గడువు ఇచ్చింది. తక్కువ సమయం ఉండటంతో కార్మిక సంఘాలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తున్నాయి. ఇప్పటికే అన్ని కార్మిక సంఘాలు నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతున్నారు. సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సామాజిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన నాయకులు ఈనెల 12 నుంచి 24 వరకు జీఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ధర్నాలు చేపట్టాయి. సీఐటీయూ సంఘం నల్లబ్యాడ్జిలతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. కేంద్ర మంత్రి ద్వారా సింగరేణి పరిరక్షణకు బీఎంఎస్ ప్రయత్నిస్తుంది. ఎంతో మందికి ఉపాధినిచ్చిన సింగరేణి ఉనికిని కాపాడేందుకు అన్ని కార్మిక సంఘాలు ఒకే లక్ష్యంతో పోరాట కార్యక్రమాలను చేపడుతున్నాయి.

# అనుమానం రాకుండా అక్రమాలు

ఖమ్మం : సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న అకౌంటెంట్ దెబ్బకు జిల్లా విద్యాశాఖ ఉలిక్కిపడింది. ఒప్పంద ఉద్యోగి పెద్దఎత్తున నిధులు స్వాహా చేయడం ఆశ్చర్యం కలిగించింది. ప్రస్తుతం తేరుకుని విచారణను వేగవంతం చేస్తోంది. విచారణ నిమిత్తం సమగ్ర శిక్షా రాష్ట్రస్థాయి అధికారులు మంగళవారం ఖమ్మం వస్తున్నట్లు సమాచారం. ఈతతంగం ఎంతకాలం నుంచి జరుగుతుందనే విషయంపై అధికారులు దృష్టి సారించారు. ఏకంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు అక్కడ మరో టీచర్, సమగ్ర శిక్షా అభియాన్ విభాగంలోని ఎఫ్ఏఓ, జిల్లా విద్యాశాఖ అధికారి సంతకాలను ఫోర్జరీ చేయడం చర్చనీయాంశంగా మారింది. డీఈఓ పేరిట బ్యాంకులో ప్రత్యేకంగా పాసుపుస్తకం తయారు చేయటంపై అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొంతకాలం నుంచి అనేక పాఠశాలలకు చెందిన స్కూల్ గ్రాంట్ నిధులను సైతం స్వాహా చేసి ఉండొచ్చనే అనుమానాలు జిల్లా విద్యాశాఖలో ఉన్నాయి. రూ.కోట్లలో అక్రమాలు జరిగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఇతను కొంతకాలం భద్రాద్రి జిల్లా బాధ్యతలు నిర్వర్తించడంతో అక్కడ అక్రమాలు జరిగాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. పోలీసులు లోతుగా విచారిస్తే పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగుచూసే అవకాశముంది.

రూ. 1.82 కోట్లు మోసం చేసిన ఉద్యోగిపై కేసు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ నిధులు కాజేసిన సమగ్ర శిక్షా అభియాన్ విభాగం ఉద్యోగిపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్షా అభియాన్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగి రామకృష్ణ జిల్లాలోని వివిధ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను ఫోర్జరీ సంతకాలతో తన ఖాతాకు జమచేసుకుని మోసగించినట్లు గుర్తించారు. డీఈఓ సోమశేఖరశర్మ ఫిర్యాదు మేరకు విచారణ జరిపి రామకృష్ణ రూ. 1.82 కోట్లు మోసం చేసినట్లు గుర్తించినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

# కౌలు 'కునేలా' భరోసా..!

ఖమ్మం : వానాకాలం పంటల నుంచే కౌలు రైతులకూ పెట్టుబడి సాయమందిస్తామని కాంగ్రెస్ సర్కారు స్పష్టం చేసింది. కౌలుదారులకు 'రైతు భరోసా'పై మార్గదర్శకాలను త్వరలోనే రూపొందిస్తామని తెలిపింది. ఈమేరకు కౌలు రైతుల లెక్కలు తేల్చే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

వివరాల సేకరణ 2014కు ముందు అప్పటి ప్రభుత్వాలు కౌలు రైతులకు అధీకృత కార్డులు పంపిణీ చేశాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈకార్డులు పనిచేయట్లేదు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన కర్షకులకు 'రైతుబంధు' పథకాన్ని తెరాస ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌలు రైతులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయమందలేదు. అధిక వడ్డీకి అప్పులు చేసి పంట ఉత్పత్తులను తిరిగి అదే వ్యాపారులకే అమ్ముకోవాల్సి రావటంతో కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులకూ పెట్టుబడి సాయమందిస్తామని 2023 శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చిన విషయం విదితమే. ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు అందటంతో కౌలు రైతుల వివరాలను సేకరించే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు. వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు సాగవుతున్నాయనే వివరాలను ఏఈఓలు ప్రభుత్వానికి నివేదిస్తారు. అయితే తాజాగా జిల్లాల వారీగా ఎంత విస్తీర్ణంలో కౌలు రైతులు పంటలు పండిస్తున్నారో ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతుల వివరాలు సర్కారు వద్ద ఉన్నాయి.



ప్రభుత్వం నుంచి రాతపూర్వక ఆదేశాలు అందగానే కౌలు రైతుల వివరాలు సమర్పిస్తామని ఉభయ జిల్లాల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. లక్ష మందికి పైనే..వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు ఖమ్మం జిల్లాలో 3,42,803 మంది ఉండగా 3,33,124 మందికి రూ. 363 కోట్ల పెట్టుబడి సాయమందుతోంది. భద్రాద్రి జిల్లాలో 1.70 లక్షల మంది అన్నదాతలుండగా 1,34,000 మందికి పెట్టుబడి సాయం కింద రూ. 220 కోట్లు జమవుతున్నాయి. వివిధ కారణాలతో ఉభయ జిల్లాల్లో 45వేల మందికి పైగా కర్షకులకు పెట్టుబడి సాయమందటం లేదు. కౌలు రైతులు ఖమ్మం జిల్లాలో సుమారు 46వేల మంది, భద్రాద్రి జిల్లాలో సుమారు 55వేల మంది ఉంటారని సమాచారం.

16 ఎకరాల్లో వరి, పత్తి, మిరప పంటలు పండిస్తున్నాను. పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగిపోయాయి. చీడపీడలతో దిగుబడులు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఈ వానాకాలం పంటల నుంచే పెట్టుబడి సాయమందిస్తే మాలాంటి వారికి మేలు జరుగుతుంది.

పోలేపల్లి కోటేశ్వరరావు, వెంకటాపురం, తల్లాడ మండలం

ఏటా కౌలు సొమ్ము పెరుగుతోంది. అప్పులు చేసి కౌలు చెల్లిస్తున్నా దిగుబడులు మాత్రం ఆశించిన స్థాయిలో రావటం లేదు. చివరికి నష్టాలనే మూటగట్టుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. పెట్టుబడి సాయం అందకపోవటం వల్ల నాలాంటి కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'రైతుభరోసా'తో మాకష్టాలు కొంతవరకైనా తీరుతాయి.

వీరమనేని శ్రీనివాసరావు, నక్కలగరువు గ్రామం, మధిర మండలం

# హుషారెత్తించేలా.. షికారు

ఖమ్మం : పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అటవీ, అటవీయేతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 ప్రకృతి సర్క్యూట్లను అధికారులు గుర్తించారు. వీటిలో భద్రాద్రి జిల్లాకు చెందిన కిన్నెరసాని, ఖమ్మం జిల్లాకు చెందిన కనకగిరి అటవీ ప్రాంతాలను చేర్చారు.

కనకగిరులకు పర్యాటక మెరుగులు

ఎత్తైన కొండలు, అరుదైన వృక్షాలు, అబ్బురపరిచే జలపాతం, చారిత్రక ఆలయాలున్న కనకగిరి గుట్టలు ఎంతో ఆహ్లాదాన్నిస్తున్నాయి. చిరుతపులులు, ఎలుగుబంట్లు, జింకలు, కణుజు, మూషికజింక, కొండగొర్రెలతో పాటు కలప, ఔషధ గుణాలున్న చెట్లు ఇక్కడి ప్రత్యేకం. గుట్టల అందాలను వీక్షించేలా నాలుగుచోట్ల వాచ్‌టవర్లు అమర్చారు. కనకగిరి రిజర్వు ఫారెస్ట్ 20,923 హెక్టార్ల విస్తీర్ణం కలిగి ఉంది. తాజాగా ప్రకృతి పర్యాటక కేంద్రంగా సర్కారు గుర్తించటంతో పర్యాటకంగా ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్, కొండల్లో 45ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టులో బోటింగ్, కనకగిరిలో వసతి సౌకర్యాలు కల్పించనున్నారు.



కిన్నెరసాని.. ప్రకృతి రమణీయ వేణి

'కిన్నెరసాని.. వచ్చిందమ్మ వెన్నెల పైటేసి..' అనే కవి భావనలకు అద్దం పట్టేలా ప్రకృతి రమణీయతకు, ఆహ్లాదభరితమైన వాతావరణానికి కిన్నెరసాని అభయారణ్యం పెట్టింది పేరు. 635 చ.కి.మీ.లో ఇది విస్తరించింది. ఇక్కడి డీర్‌పార్కులోని దుప్పులు, నెమళ్లు, డక్‌పార్కులోని బాతులు, కోతులు, కొండముచ్చులు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. రిజర్వాయర్‌లో బోటు షికారు మరింతగా ఆకర్షిస్తుంది. అంతేకాకుండా అంతరించిపోతున్న అరుదైన జంతుజాతులను రక్షించేందుకు వన్యమృగ సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. పాల్వంచలో సఫారీ, ట్రెక్కింగ్ ఏర్పాటు, రంగాపురం క్యాంపు సందర్శనతో పాటు జంగాలపల్లి అటవీప్రాంతాన్ని పర్యాటకులు వీక్షించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ కనకగిరి అటవీ ప్రాంతాన్ని ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. దీనివల్ల స్థానిక యువతకు మెరుగుపడతాయని స్పష్టం చేశారు.



# శభాష్ సైనికా.. మీ తెగువకు వందనం

దిల్లీ: వాళ్లంతా సైనికులు. అత్యంత ఎత్తైన ప్రదేశాల్లో యుద్ధవ్యూహాలను ఎలా అమలు చేయాలో నేర్చుకోవడంలో భాగంగా లద్దాఖ్‌లోని కున్ పర్వతాన్ని అధిరోహించేందుకు బయలు దేరారు. మొత్తం 38 మంది వెళ్లగా... హఠాత్తుగా హిమపాతం సంభవించింది. 34 మంది బయటపడగా.. నలుగురు మాత్రం అందులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 6 గంటల పాటు శ్రమించి.. అందులో ఒకరి మృతదేహాన్ని బయటకు తీశారు. మిగతవారి మృతదేహాలు లభ్యంకాలేదు. అనంతరం 9 నెలల తర్వాత మిగతా ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. గత ఏడాది అక్టోబరు 8న ఈ ఘటన జరిగింది. దీనిపై విశ్రాంత ఆర్మీ అధికారి బ్రిగేడియర్ హర్‌దీప్ సింగ్ సోహి 'ఎక్స్' వేదికగా స్పందించారు. హై ఆల్టిట్యూడ్ వార్‌ఫేర్ స్కూల్ సైనికుల ధైర్యసాహసాలను అభినందించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి.. అమరవీరుల మృతదేహాలను బయటకు తీసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ 8న జరిగిన ప్రమాదంలో హవల్దార్ రోహిత్ కుమార్, హవల్దార్ ఠాకూర్ బహదూర్, నాయక్ గౌతమ్‌లు, లాన్స్ నాయక్ స్టాన్జిన్‌లు మంచు ఫలకాల కింద చిక్కుకొని ప్రాణాలు విడిచారు. అదే రోజున 6 గంటల పాటు శ్రమించి స్టాన్జిన్ మృతదేహాన్ని బయటకు తీశారు. మంచు విపరీతంగా కురుస్తుండటంతో మిగతా వారిని బయటకు తీయడం సాధ్యం కాలేదు. 'సైనికుల మృతదేహాలను వెలికి తీసేందుకు ఇంత సమయమా?' అంటూ సోషల్ మీడియాలో వస్తున్న సందేహాలను హర్‌దీప్ సింగ్ నివృత్తి చేశారు. " ఇంత ఆలస్యమా? అంటూ కొందరు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఆరు గంటల్లోనే ఒక దేహాన్ని బయటకు తీసిన సైనికులు మిగతా వారిని ఎందుకు తేలేకపోయారు? మనం కూడా కాస్త ఆలోచించాలి. అక్కడి పరిస్థితులు అసాధారణంగా ఉంటాయి. దాదాపు 70 అడుగుల లోతులో కూరుకు పోయిన మృతదేహాలను గుర్తించడం అంత సులభం కాదు. మరోవైపు ప్రతికూల పరిస్థితులు కూడా అడ్డంకిగా మారుతాయి. ఏ ఒక్క మృతదేహాన్ని వదలకూడదనే సంకల్పంతో ఈసారి సైనికులు అత్యాధునిక పరికరాలను, రెక్కో రాడార్లను తీసుకెళ్లారు. 9 రోజులు కష్టపడితేగానీ మృతదేహాలు వెలికితీయడం సాధ్యం కాలేదు." అని వివరించారు. హెచ్‌ఏడబ్ల్యూఎస్‌కు చెందిన సైనికులు పర్వతారోహణను గతేడాది అక్టోబర్ 1న ప్రారంభించి... అక్టోబర్ 13 నాటికి కున్ పర్వత శిఖరాన్ని చేరుకోవాల్సి ఉంది. అయితే, అక్టోబర్ 8 నాటికి సుమారు 18,300 అడుగుల ఎత్తుకు చేరారు. అప్పుడే ఈ ఘటన జరిగింది. అయితే, మంచు ఫలకాల కింద ఏ ఒక్కర్నీ వదలకూడదన్న దృఢసంకల్పంతో హెచ్‌ఏడబ్ల్యూఎస్ డిప్యూటీ కమాండెంట్ బ్రిగేడియర్ ఎస్ఎస్ షెకావత్ ఆధ్వర్యంలో పర్వతారోహకుల బృందం జూన్ 18న ఆపరేషన్ ఆర్.టి.జి. (రోహిత్, ఠాకూర్, గౌతమ్) చేపట్టింది. ఘటనాస్థలికి చేరుకున్న తర్వాత తొమ్మిది రోజుల పాటు తీవ్రంగా శ్రమించి మృతదేహాలను వెలికి తీసింది.




# రాజకీయ వలసలపై మాట్లాడే నైతికత భారాసకు లేదు

రాజకీయ వలసలపై మాట్లాడే నైతికత భారాస నాయకులకు లేదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు గతంలో భారాస ఏం చేసిందో గుర్తుచేసుకోవాలన్నారు. అవినీతి, అహంకారం వల్లే రాష్ట్రంలో భారాస ఓడిపోయిందన్నారు. పదేళ్ల భారాస పాలన అవినీతిమయమని కడియం ఆరోపించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం ఈ మేరకు మాట్లాడారు.

# బురద చల్లడం ఆపి.. ఓటమిని సమీక్షించుకోండి



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు తమపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికీ భ్రమాలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల భంగపాటు తర్వాత లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఈరోజు(గురువారం) గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తామని తెలిపారు. నిస్పృహతో కూడిన ప్రకటనలతో గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రజయోజనం ఉండదని చెప్పారు. రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. వారి అభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైనా కొనసాగుతుందని తెలిపారు. ఇంత జరిగినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు సచివాలయానికి రాకుండా నివాసం నుంచే పాలన సాగించారని ధ్వజమెత్తారు. కనీసం ప్రతిపక్ష నేతగానైనా ఆయన జనం మధ్యకు వెళ్తారనుకున్నామని కాని ఇంట్లోనే కూర్చుని కార్యకర్తలను తనవద్దకు రప్పించుకుంటున్నారని దెప్పిపొడిచారు. కాంగ్రెస్ పార్టీ యాదృచ్ఛికంగా అధికారంలోకి వచ్చిందని ఇప్పటికీ ప్రచారం చేస్తుండటం వాళ్ల ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలిసిపోతోందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకుందని... బీఆర్ ఎస్‌కు దక్కింది 39 మాత్రమే. 25 సీట్ల ఆధిక్యతను మర్చిపోతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 2019 లో 9 స్థానాలు గెల్చిన ఆ పార్టీ సున్నాకే పరిమితమైందని సెటైర్లు గుప్పించారు. ఇది ప్రజలిచ్చిన తీర్పు కాదా? అయినా ఓటమితో దిష్టి తొలగిందని సమర్థించుకోవడం ఏంటి? అని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చి 15 ఏళ్లు అధికారంలో ఉంటామని గాంభీర్యాలకు పోవడం కలలో జీవించడం కాదా అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రజలకు ఏలోటూ రాకుండా చూసుకుని మళ్లీ మళ్లీ గెలుస్తాం అనడంలో హేతుబద్ధత ఉందని తెలిపారు. నేలమట్టమైన పార్టీని నాలుగున్నరేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకొచ్చి 15 ఏళ్లు నిరాటంకంగా పరిపాలిస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ది తార్కికతకు దగ్గరగా లేని అందమైన ఊహ అనుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.

# పవన్ ఫోటోలు పెట్టినట్టే భట్టి ఫోటోలు కూడా పెట్టాల్సిందే...

యాదాద్రి, జూలై 11: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు గురువారం దర్శించుకున్నారు. అనంతరం అభిమానులతో తన జన్మదినం సందర్భంగా సన్నిధి హోటల్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ... "గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బిక్షమయ్యగౌడ్, బీర్ల ఐలయ్యలకు సపోర్ట్ చేసి గెలిపించా. లంచాలు, పైరవీలు డబ్బుపై ఆశ లేకుండా నా హయాంలో పాలన చేశా. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో నాకు పోటీ చేసే అవకాశం రాలేదదు. తెలంగాణలో నేను ఎక్కడ పోటీ చేసినా నాకు పది వేల ఓట్ల మేజారిటీ వస్తుంది. నాకు యాదగిరిగుట్టలో అర్ధ గజం భూమి లేదు... ఎలాంటి ఆస్తులు సంపాదించలేదు. ఇప్పుడున్న ఎన్నికల్లో కోట్లకు విలువ ఉంది, ప్రజలకు సేవ చేసిన వాడికి విలువ లేదు. బడుగు బలహీన వర్గాల వారి తరఫున నేను ఎల్లప్పుడూ పోరాడుతానే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.

**రెడ్లకే ప్రాధాన్యత...** బీసీలలో ముదిరాజులు, గౌడ్స్, పద్మాశాలిలు ఉన్నా వారందరిని పక్కన పెట్టి రెడ్లకే ప్రాధాన్యత ఉందని వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎంతో సమానంగా పవన్ కళ్యాణ్ ఫోటోలు అన్ని ఆఫీసులలో ఉండాలని అక్కడి సీఎం జీవో రిలీజ్ చేశారన్నారు. తెలంగాణలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు సమానంగా దళిత ఉపముఖ్యమంత్రి అయిన భట్టి వికమార్క ఫోటోను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. తన భవిష్యత్తు కార్యచరణ పోరాటమే తప్ప ఏమీలేదని మోత్కుపల్లి నర్సింహులు వెల్లడించారు.

# కిషన్‌రెడ్డి.. కేంద్రమంత్రిగా హైదరాబాద్‌కు ఏం చేశారు?: మంత్రి పొన్నం




హైదరాబాద్: పార్లమెంట్ సభ్యుడిగా.. కేంద్రమంత్రిగా ఉండి హైదరాబాద్ అభివృద్ధికి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని తెలంగాణ మంత్రి పొన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసినట్లుగా, అభివృద్ధి కుంటుపడినట్లుగా కిషన్‌రెడ్డి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కేంద్రం హైదరాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేదని, అమృత్ పథకం నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతోనే రాజకీయ లబ్ధి కోసం హైదరాబాద్‌ను విమర్శిస్తున్నారని ఆక్షేపించారు. "హైదరాబాద్.. చారిత్రక నగరం ఇస్తాంబుల్ వంటిది. చార్మినార్, గోల్కొండ వంటి ఆర్కియాలజీకి సంబంధించి ఎన్నో ఉన్నాయి. కేంద్ర పర్యాటక మంత్రిగా గత ఐదేళ్లలో కేంద్రం నుంచి హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ విభాగాల నుంచి హైదరాబాద్‌కు కిషన్‌రెడ్డి ఏం తెచ్చారు? ఒక్క రూపాయి అయినా తెచ్చారా? మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి నిధులు కావాలని అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. హైదరాబాద్‌లో 151 ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు నీటి నిల్వలతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇంఛార్జి మంత్రిగా ఇక్కడి సమస్యలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. వీలైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి.

**కేటీఆర్ మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది :** భాజపాపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయిన కేటీఆర్.. ఇప్పుడు హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. భూకబ్జాలు, అక్రమ కట్టడాలతో హైదరాబాద్ ఇలా కావడానికి కారణం కేటీఆరే. మా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలే అయింది. ఈ ఆరు నెలల్లో జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ కలెక్టరేట్‌లో అనేక సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నాం. బోనాల పండగ తర్వాత నేరుగా బస్తీల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం.

**విద్యార్థులూ.. ప్రతిపక్షాల ఉచ్చులో పడకండి :** ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగితే ఉద్యోగ నియామకాలు ఏమైయ్యాయని అడిగింది ప్రతిపక్షాలే. ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదీ వీళ్లే. ఈ పదేళ్లలో టెట్, డీఎస్సీ నిర్వహించనోళ్లు ఇప్పుడు నిరుద్యోగులను ఎందుకు రెచ్చగొడుతున్నారు? నిజమైన సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నాయకులను కోరుతున్నా"అని మంత్రి పొన్నం తెలిపారు.

# అన్నదాతల అభిప్రాయాల మేరకే రైతు భరోసాపై నిర్ణయం: భట్టి విక్రమార్క



ఉట్నూర్: అందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో రైతు భరోసా వర్క్‌షాప్ నిర్వహించారు. మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో రైతుభరోసా పథకం విధివిధానాలపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అన్నదాతల అభిప్రాయాల మేరకు ప్రభుత్వ నిర్ణయం ఉంటుందన్నారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి యోచిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చిన్న రైతుల కోసం పథకాల రూపకల్పనకు ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రజలతో చర్చించి పథకాలు అమలు చేయడమే లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# ఈనెల 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



హైదరాబాద్, జూలై 11: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈనెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమావేశాల నిర్వహణపై ఈరోజు (గురువారం) అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అసెంబ్లీలో రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్‌లు రామచంద్రనాయక్, ఆది శ్రీనివాస్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

అయితే అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఈసమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అలాగే రైతు భరోసా పథకంపై చర్చతో పాటు, జాబ్ కాలెండర్‌ను ఈ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలి



హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు (గురువారం) బహిరంగ లేఖ రాశారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకురావాలని కోరారు. పదేళ్లుగా ప్రతి బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు మొండిచెయి చూపిందని మండిపడ్డారు. ఈసారి అయినా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ ను తెప్పించాలని కోరారు.

కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంత మేరకు తీరుతాయని అన్నారు. నేతన్నలను ఆదుకోవడంలో రాష్ట్ర సర్కారు ఫెయిల్ అయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# బెంగళూరు స్టార్టప్ ప్రపంచ రికార్డ్?.. అత్యంత ఎత్తైన పాస్ వద్ద డ్రోన్ పరీక్ష

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన కనుమగా పేరున్న లద్దాఖ్‌లోని ఉమ్‌లాంగ్ లా పాస్ వద్ద బెంగళూరుకు చెందిన న్యూస్పేస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీస్ సంస్థ డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. దీనిని ఈ శ్రేణి డ్రోన్ల సామర్థ్యంలో ప్రపంచ రికార్డుగా చెబుతున్నారు. ఇది దాదాపు 25 కిలోల పేలోడ్ తీసుకొని.. 100 కిలోల టేకాఫ్ సామర్థ్యంతో పని చేసింది. ఓ ఆంగ్ల పత్రికకు ఆ కంపెనీ సీఈవో సమీర్ జోషీ స్వయంగా ఈవిషయాన్ని వెల్లడించారు. ఈ డ్రోన్ పనిచేసే పరిధి కూడా చైనాకు చెందిన డీజేఐ ఫ్లైకార్ట్ 30 రకం కంటే చాలా మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్ 24న చైనా డీజేఐ డ్రోన్లను మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద ప్రదర్శించింది. అయితే తమ డ్రోన్ సముద్రమట్టం కంటే దాదాపు 6,200 మీటర్ల ఎత్తులో కూడా విజయవంతంగా ఎగిరిందని న్యూస్పేస్ సీఈవో పేర్కొన్నారు. 100 కేజీల అత్యధిక టేకాఫ్ శ్రేణిలో న్యూస్పేస్ డ్రోన్‌దే ప్రపంచ రికార్డని జోషీ వెల్లడించారు. తమ డ్రోన్లు సైనిక, పౌర అవసరాలకు బాగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. "ఈ డ్రోన్ల రవాణాకు, విపత్తు నిర్వహణ, సహాయక చర్యలు, మెడికల్ రిలీఫ్ సేవలకు మెరుగ్గా ఉపయోగపడుతుంది" అని జోషీ పేర్కొన్నారు. ఈ పరిణామంపై రిటైర్డ్ ఎయిర్ వైస్‌మార్షల్ మన్మోహన్ బధోరియా మాట్లాడుతూ "ఇది పేలోడ్ పరంగా, ఆల్టిట్యూడ్ పరంగా మనకు శుభవార్త. సియాచిన్ వంటి ప్రాంతాల్లో ముఖ్యమైన చిన్న పరికరాలు, ఔషధాలు వంటివి సరఫరా చేయడానికి బాగా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పుడు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. యుద్ధ విమానం నిర్వహణ ఖర్చు ఎత్తైన ప్రాంతాల్లో అత్యధికంగా ఉంటుంది. ఒక చీతా హెలికాప్టర్ 25 కిలోల పేలోడ్‌తో అంత ఎత్తులో ప్రయాణించడానికి.. డ్రోన్ ద్వారా అంతే బరువైన వస్తువులు పంపడానికి అయ్యే ఖర్చులో చాలా తేడా ఉంటుంది.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660